

ఫిర్యాదు చేసినా చర్యల్లేవ్

యువతను మోసం చేసి విదేశాలకు పంపిస్తున్న ఏజెన్సీలపై చర్యలు తీసుకునే నాథులే కరువయ్యారు. ఇటీవల సౌదీ అరేబియాలో జిల్లాకు చెందిన 30 మంది యువకులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అక్కడ ఉపాధి లేక తాము పడుతున్న దుస్థితిని వివరిస్తూ పంపిన వీడియో సందేశం 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. వజ్రపుకొత్తూరు మండలంలోని పూండి, ఇచ్ఛాపురంలోని ఏజెన్సీలే తమను మోసగించి అక్కడకు పంపించాయని వారు వెల్లడించినప్పటికీ కనీస చర్యలకూ పోలీసులు ఉపక్రమించలేదు. గతంలో పూండి ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు ఆర్మీ, విదేశాల ఉద్యోగాల పేరుతో మోసగించిన నేపథ్యంలో అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేసి గట్టి చర్యలు తీసుకున్నారు. దాంతో సుమారు పదేళ్ల పాటు ఏజెంట్లు కనిపించకుండా పోయారు.

విదేశీ వల.. మోసపోతున్న యువత!

- ఏజెన్సీలు, దళారీల మాయమాటలతో ఉచ్చులోకి..
- ఉపాధి కోసం వెళ్లి.. విదేశాల్లో చిక్కుకున్న వారెందరో..
- తాజాగా ట్రైనింగ్ సెంటర్ల పేరిట నిరుద్యోగులకు వల
- కట్టడి చేయలేకపోతున్న అధికారులు

వజ్రపుకొత్తూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి)

స్థానికంగా ఉపాధి అవకాశాలు లేకపోవడం, కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహరించకపోవడంతో జిల్లాలోని తీరప్రాంతాల్లో యువత అధికంగా విదేశాల్లో ఉపాధి పొందేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఉద్దానం, తీరప్రాంత మండలాలైన ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట, మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన యువత విదేశాలకు ఉపాధి కోసం అధికంగా వెళ్తుంటారు. అలాంటి వారిని విదేశాల్లోని కంపెనీలకు మ్యాన్‌పవర్ సమకూర్చే ఏజెంట్లు, దళారీలు మోసగిస్తున్నారు. యువత బలహీనతను వారు సొమ్ము చేసుకుంటున్నారు. యువత అవసరాన్ని ఆసరాగా చేసుకుని వారి నుంచి రూ.లక్షల్లో వసూలు చేసి మంచి కంపెనీల్లో ఉద్యోగాలంటూ విదేశాలకు పంపిస్తున్నారు. ఈక్రమంలో వారు కొందరిని విదేశాలకు విజిటింగ్ వీసాలపై పంపించి చేతులు దులుపుకొన్న ఘటనలూ అధికమే. విదేశాల్లోని చిన్న కంపెనీలకు పంపడం వల్ల అక్కడ సరిగ్గా ఆయా యాజమాన్యాలు జీతాలు కూడా ఇవ్వని పరిస్థితులు సర్వసాధారణంగా మారాయి. చివరకు నెలల తరబడి పనులు చేయించుకుని, వారిని బందీలుగా ఉంచి, భోజనాలు కూడా పెట్టని ఘటనలు అనేకం. విదేశాలకు పంపించే సమయంలో సదరు ఏజెంట్లు, దళారీలు చెప్పిన మాటలకు, అక్కడ జరిగే వ్యవహారాలకు ఎక్కడా పొంతన ఉండదు. అదే విషయంపై సదరు వ్యక్తులను నిలదీస్తే చేతులెత్తేయడం పరిపాటిగా మారింది. చివరకు విదేశాల్లో చిక్కుకున్న యువత వీడియోల సందేశాలతో ఇబ్బందులు తెలియజేస్తూ ప్రభుత్వ సాయాన్ని కోరడం సర్వసాధారణమైంది.

కొత్త తరహాలో మోసం..

ఇటీవల ఏజెంట్లు, దళారీలు కొత్త తరహా మోసానికి తెరతీశారు. ట్రైనింగ్ సెంటర్లు పేరుతో నిరుద్యోగులను ఆకర్షిస్తున్నారు. ఇక్కడే శిక్షణ ఇచ్చి విదేశాలకు తామే పంపిస్తామని చెబుతూ రూ.లక్షలు గుంజేస్తున్నారు. వీరి మాటలు నమ్మి ఇప్పటికే విదేశాలకు వెళ్లినవారు అక్కడ ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీలు చెప్పిన జీతాలకు, పంపించిన పనికి సంబంధం లేకపోవడంతో దేశం కాని దేశంలో అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా విశాఖపట్నంలోని ఆటోనగర్ వద్ద ఉన్న విదేశీ ఏజెన్సీలకు పూండి, ఇచ్ఛాపురం కేంద్రాలలో నడుపుతున్న ఏజెన్సీలు ఉప ఏజెన్సీలుగా కొనసాగుతున్నాయి. వారు ఏమి చెబితే వీరూ అదే చెప్పి నిరుద్యోగులకు వల వేస్తున్నారు.





ఉజ్బెకిస్తాన్‌లో ఇబ్బందులు పడి..

పై చిత్రంలో కనిపిస్తున్న వారంతా.. వజ్రపుకొత్తూరు మండలం పెద్దమురహరిపురం, చినమురహరిపురం, రామకృష్ణాపురం, చిన్న పల్లివూరు, అమలపాడు, సంతబొమ్మాళి మండలం భావనపాడు, నందిగాం మండల కేంద్రానికి చెందిన యువకులు. వీరి పేర్లు జీవన్, చింత హేమారావు, రాజాం మహేష్, నందిగాం శ్రీను, గర్తం జోగారావు, గొరకల షణ్ముఖరావు, శంకరావు. పల్లివూరు, భావనపాడుకు చెందిన ఏజెంట్లు.. విదేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తామని వీరికి ఆశ కల్పించారు. వారి నుంచి డబ్బులు తీసుకుని అక్టోబరులో ఉజ్బెకిస్తాన్ దేశం పంపించారు. అక్కడకు చేరుకున్న తర్వాత లాడ్జీలో ఉంచిన అక్కడ ఏజెంట్లు సరైన తిండి పెట్టలేదు. కంపెనీలో ఉద్యోగాలు కల్పించలేదు. దీంతో మూడు నెలలుగా తామంతా ఇబ్బందులు పడ్డామని ఈ యువకులు ఆవేదన వ్యక్తం చేశారు. 'మాకు విజిట్ వీసా ఇచ్చి ఉజ్బెకిస్తాన్ పంపించారు. ఒక్కొక్కరి నుంచి రూ.1.50లక్షలు చొప్పున ఏజెంట్లు వసూలు చేశారు. కంపెనీలో సరైన ఉద్యోగాలు కల్పించలేదు. జీతాలు ఇవ్వలేదు. దీంతో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. స్వదేశానికి పంపించాలని వేడుకున్నా.. మమ్మల్ని పట్టించుకోలేద'ని వారు వాపోయారు. ఈ విషయాన్ని ఇటీవల వీడియోకాల్ ద్వారా తమ కుటుంబ సభ్యులకు, బంధువులకు చెప్పి.. ఆవేదన వెల్లగక్కారు. స్థానిక నాయకులు.. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఇంతలో అక్కడ అధికారులు కూడా స్పందించారు. వారివి విజిట్ వీసాలు కావడంతో స్వదేశానికి పంపించేందుకు అనుమతించారు. ఈ నేపథ్యంలో సొంత ఖర్చులతో శనివారం సాయంత్రం నాటికి వారంతా ఉజ్బెకిస్తాన్ నుంచి స్వగ్రామాలకు చేరుకున్నారు. దీంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నకిలీ ఏజెన్సీలను నమ్మొద్దు

విదేశాల్లో ఉద్యోగాల కోసం వెళ్లే యువత నకిలీ ఏజెన్సీలతో మోసపోవద్దు. విదేశాల ఉద్యోగాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోండి. నకిలీ ఏజెన్సీలపై ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పూండి ఏజెన్సీ నిర్వాహకులను స్టేషన్‌కు పిలిచి మాట్లాడాం. వారి నుంచి స్వాధీనం చేసుకున్న పత్రాలను పరిశీలిస్తున్నాం. ఇదే విషయంపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం.

- బి.నిహార్, ఎస్ఐ, వజ్రపుకొత్తూరు

ఉపాధి అవకాశాలు కల్పించాలి

విదేశీ ఉద్యోగాల మోజులో యువత అధికంగా మోసపోతున్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు లేకపోవడమే ఇందుకు కారణం. ఉపాధి కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. అధికంగా జిల్లావాసులే మోసపోవడం బాధాకరం. నకిలీ ఏజెన్సీలను గుర్తించి చర్యలు చేపడితే మేలు.

- జోగి తిరుపతిరావు, జూనియర్ కాలేజీ లెక్చరర్, పలాస



వేంకటేశ్వరుడికి లక్ష తులసీ దళార్చన

నరసన్నపేట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నరసన్నపేటలోని వేంకటేశ్వర ఆలయంలో స్వామికి లక్ష తులసీ దళార్చన నిర్వహించారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

మత్స్యకారులకు.. రెట్టింపు భరోసా

- వేట నిషేధ భృతి రూ.20వేలకు పెంపు
- జిల్లాలో 16వేల మందికి లబ్ధి

సంతబొమ్మాళి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మత్స్యకారుల వేట నిషేధ భృతిని రెట్టింపు చేయాలని నిర్ణయించింది. దీంతో మత్స్యకారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధిని గాలికొదిలేసింది. వారికి ఇవ్వాల్సిన రాయితీలను ఎత్తేసింది. దీంతో మత్స్యకారులు అనేక ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి మత్స్యకారులు తమ సమస్యలను తీసుకెళ్లారు. మంత్రి అచ్చెన్న వాటిని సీఎం చంద్రబాబుకు తెలియజేశారు. ఈ మేరకు ఇటీవల అమరావతిలో నిర్వహించిన మంత్రిమండలి సమావేశంలో మత్స్యకారుల వేట నిషేధ భృతిని రూ.10వేల నుంచి రూ.20వేలకు పెంచాలని నిర్ణయించారు. దీంతో జిల్లాలో 16వేలమంది మత్స్యకారులకు లబ్ధి కలుగనుంది.



జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో 11 మండలాల పరిధిలో 193 కిలోమీటర్ల తీరప్రాంతం ఉంది. 104 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో 1,12,500 మంది మత్స్యకార జనాభా ఉన్నారు. వీరిలో 16వేల మంది మత్స్యకారులు మోటరైజ్డ్, సంప్రదాయ పడవల్లో వేట సాగిస్తున్నారు. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు సముద్రంలో చేపల వేటను ప్రభుత్వాలు నిషేధిస్తుంటాయి. ఈ 60 రోజులూ చేపలు గుడ్లు పెట్టి సంపదను వృద్ధి చేస్తుంటాయి. వేట నిషేధ కాలానికిగాను మత్స్యకారుల జీవనం కోసం ప్రభుత్వాలు భృతి చెల్లిస్తుంటాయి. అయితే, గత వైసీపీ సర్కారు రూ.10వేలు మాత్రమే చెల్లించేది. ఈ భృతి కుటుంబ పోషణకు చాలక మత్స్యకారులు ఇబ్బందులు పడేవారు. పైగా పింఛన్, రైతుభరోసా పొందిన మత్స్యకారులకు వేట నిషేధ భృతిని నిలిపివేసేవారు. అలాగే అనర్హులకు భృతి అందించారన్న ఆరోపణలున్నాయి. గత (మిగతా 8వ పేజీలో..)

సాంకేతిక విద్య కళాశాలలు ఎక్కడ?



- ఇచ్ఛాపురంలో ఏర్పాటుకాని వైనం
- ఐటీఐ చదవాలంటే పలాస వెళ్లాల్సిందే
- పాలిటెక్నిక్ కోర్సులకు శ్రీకాకుళం పరుగు పెట్టాల్సిందే
- విద్యార్థులకు తప్పని అవస్థలు

ఇచ్ఛాపురం, జనవరి 5(ఆంధ్రజ్యోతి)

జిల్లాలోనే ఇచ్ఛాపురం మునిసిపాల్టీకి సుదీర్ఘ చరిత్ర ఉంది. జిల్లా కేంద్రం శ్రీకాకుళం తరువాత తొలి మునిసిపాల్టీ కూడా ఇచ్ఛాపురమే. కానీ ఆశించిన స్థాయిలో మాత్రం ప్రభుత్వం వనరులు సమకూర్చడం లేదు. ప్రధానంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సాంకేతిక విద్య కళాశాలలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు లేకపోవడంతో విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. దీనివల్ల వారికి వ్యయప్రయాసలు తప్పడం లేదు. ముఖ్యంగా ఇచ్ఛాపురంలో ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐ కాలేజీ ఏర్పాటు చేస్తే నియోజకవర్గంలో వేలాది మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగనుంది. కానీ, ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఇచ్ఛాపురంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. అయితే అక్కడ సంప్రదాయ కోర్సులు, గ్రూపులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. సాంకేతిక విద్యకు సంబంధించి ఎటువంటి విద్యాసంస్థలు లేవు. ప్రభుత్వ ఐటీఐలో చేరాలంటే 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న పలాస వెళ్లాల్సిందే. పాలిటెక్నిక్ కాలేజీలో చేరాలంటే 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీకాకుళం, ఆమదాలవలస వెళ్లాల్సి వస్తోందని స్థానిక విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాంకేతిక విద్యతో ప్రయోజనం..

ప్రస్తుత విద్యార్థులకు సాంకేతిక విద్య చాలా అవసరం. రక్షణ రంగాల ఎంపికలో సైతం సాంకేతిక విద్యకు పెద్దపీట వేస్తున్నారు. రైల్వేతో పాటు ఇతర రంగాల్లో సైతం డిప్లమోతో పాటు ఐటీఐ చేసిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సులువుగా దక్కుతున్నాయి. అయితే, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు, ఐటీఐ కాలేజీలు అందుబాటులోకి లేకపోవడంతో విద్యార్థులు ప్రైవేటు సంస్థలను ఆశ్రయిస్తున్నారు. దీంతో యాజమాన్యాలు అధిక ఫీజు వసూలు చేస్తున్నాయి. కొందరు విద్యార్థులు పక్కనే ఒడిశా రాష్ట్రం బరంపూర్‌లో ఉన్న పాలిటెక్నిక్, ఐటీఐ కాలేజీల్లో చేరుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

తక్షణం ఏర్పాటు చేయాలి



ఇచ్ఛాపురంలో పాలిటెక్నిక్‌తో పాటు ఐటీఐ కాలేజీని తక్షణం ఏర్పాటు చేయాలి. పట్టణంతో పాటు పరిసరాల్లో 50 గ్రామాల విద్యార్థులకు సాంకేతిక విద్య అంటేనే కష్టమవుతోంది. టెన్త్ తరువాత చాలామంది విద్యార్థులు పాలిటెక్నికల్ కోసం దూరం ప్రాంతాలకు వెళ్లలేక స్థానికంగా ఇంటర్‌లో జాయిన్ అయిపోతున్నారు. దీంతో సాంకేతిక విద్య కోరిక తీరడం లేదు. గతంలో ఎన్నోసార్లు మంత్రుల దృష్టికి కూడా ఈ విషయం తీసుకెళ్లాను.

-దాసరి రాజు, ఇచ్ఛాపురం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి

విద్యార్థుల కష్టాలను గుర్తించాలి



ఇచ్ఛాపురంపై పాలకులు, ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయి. ఐటీఐ చదవాలంటే 50 కిలోమీటర్ల దూరంలోని పలాస వెళ్లాల్సి వస్తోంది. పాలిటెక్నిక్‌లో చేరాడం అంటేనే ఇబ్బందిగా మారింది. ఎక్కడో 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీకాకుళం వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఇక్కడి విద్యార్థుల కష్టాలను గుర్తించాలి.

-దక్కత సుమన్, రిటైర్డ్ ఆర్మీ కెప్టెన్, ఇచ్ఛాపురం

ఇబ్బందులెన్నో

ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి చదువుల కోసం దూర ప్రాంతాకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో చాలామంది విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరమవుతున్నారు. ఇచ్ఛాపురంలో ఐటీఐ లేకపోవడంతో.. 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న కంచిలిలో ప్రైవేటు ఐటీఐలో చదువుతున్నాను. రోజూ రాకపోకలు సాగించేందుకు ఎన్నో ఇబ్బందులు పడుతున్నాను.

-శ్రావణ్, ఐటీఐ విద్యార్థి, ఇచ్ఛాపురం కార్జీవీధి

వృథాగా.. అగ్రిల్యాబ్‌లు

- దుర్వినియోగమైన నిధులు
- మూలకు చేరిన పరికరాలు
- రైతులకు సక్రమంగా అందని సేవలు



టెక్కలి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అగ్రి ల్యాబ్ భవన నిర్మాణాలు నిరుపయోగంగా మారాయి. వైసీపీ హయాంలో లక్షలాది రూపాయలతో నిర్మించిన ఈ భవనాలు కొన్నిచోట్ల వినియోగంలో లేక వృథాగా ఉన్నాయి. వ్యవసాయ, మత్స్య, పశుసంవర్ధకశాఖలను కలుపుతూ అగ్రిల్యాబ్‌లు నిర్మించారు. నియోజకవర్గానికి ఒక్కో భవన నిర్మాణానికిగానూ గత ప్రభుత్వం రూ.84లక్షలు నిధులు కేటాయించింది. 2022 జూలై 23న అప్పటి సీఎం జగన్ వర్చువల్ విధానంలో వీటిని ప్రారంభించారు. కాగా.. టెక్కలి, సోంపేట నియోజకవర్గాల్లో నిర్మాణాలు పూర్తయినా.. నేటికీ వినియోగానికి నోచుకోవడం లేదు. ఆమదాలవలసలో మాత్రమే కొంతమేర సేవలు సక్రమంగా అందుతున్నాయి. మిగిలిన నియోజకవర్గాల్లో అంతంతమాత్రంగానే సేవలు కొనసాగుతున్నాయి.

- వ్యవసాయశాఖకు సంబంధించి పరిశీలిస్తే.. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నాణ్యతను పరిశీలించాలి. కాగా.. భవనాలు ప్రారంభించి సుమారు 18 నెలలైనా.. ఇప్పటికీ వ్యవసాయశాఖ ద్వారా ఏ రకమైన నాణ్యతా పరీక్షలు చేయలేదు. విత్తన విభాగం నాణ్యత పరిశీలనకు బ్లోవర్, డివైడర్, జన్యుమరేటర్, పవర్‌టీ బోర్డు తదితర సాంకేతిక పరికరాలు అవసరం. ఇవి కార్యాలయానికి చేరుకున్నా అమర్చలేదు. ఎరువుల నాణ్యత పరిశీలనకుగాను గ్లాస్‌వేర్ సామగ్రి, కెమికల్స్, వాటర్‌బాత్, డిస్టల్ వాటర్ యూనిట్, హాట్ ఎయిర్ ఓవెన్, డిస్‌క్వార్టర్స్ ఫ్లేమ్‌హుడ్, డయాగ్నస్టిక్, డిస్టెన్స్ యూనిట్ వంటి సాంకేతిక సామాగ్రి అవసరం. ఇక పురుగు మందులకు సంబంధించి నాణ్యతా ప్రమాణాలు పర్యవేక్షించేందుకు ఒక్క పరికరం కూడా అగ్రిల్యాబ్‌కు చేరలేదు.
- విత్తనాల నాణ్యతా ప్రమాణాలు పరిశీలించాలంటే రైతులు (మిగతా 7వ పేజీలో..)



టెక్కలిలోని అగ్రిల్యాబ్‌లో మూలకు చేరిన సాంకేతిక పరికరాలు





మోగిన శంఖం

కదంతొక్కిన హైందవ సోదరులు.. కాషాయమయమైన కేసరపల్లి

భారతీయ సంస్కృతీ, సంప్రదాయం, సనాతన ధర్మం, ఆధ్యాత్మికతను భవిష్యత్ తరాలకు చాటిచెప్పే ఉద్దేశంతో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలోని గన్నవరం మండలం కేసరపల్లిలో ఆదివారం హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హిందువులు పెద్ద ఎత్తున తరలి రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దేశవ్యాప్తంగా కీర్తి గడించిన ఎందరో హైందవ నేతలు తమ ప్రసంగాల్లో హిందూధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి హైందవ సోదరులు ర్యాలీలుగా తరలివచ్చారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి


సభా ప్రాంగణానికి వెళ్తున్న హిందువులు




సభలో ప్రసంగిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి, గోవింద్ దేవ్ గిరిజి మహరాజ్, స్వామి కమలానంద, స్వామి వరదానంద


హిందూ సోదరులతో కిక్కిరిసిన కేసరపల్లిలోని సభా ప్రాంగణం


కొత్తపేట వద్ద నిర్మించిన బ్యారేజీ

తారకరామపైనే ఆశలు

- దశాబ్దాలుగా కలగా మిగిలిన ప్రాజెక్టు ● గత ఐదేళ్లూ పూర్తి నిర్లక్ష్యం
- ఏటా బడ్జెట్‌లో కేటాయింపులే తప్ప మంజూరు లేకపోయె
- ప్రత్యేకంగా దృష్టిపెట్టిన కూటమి ప్రభుత్వం

తారకరామతీర్థ సాగర్.. విజయనగరం జిల్లాలో వేలాది ఎకరాల్లో సాగు... వందలాది గ్రామాల తాగునీటి అవసరాలు తీర్చగలిగే ప్రాజెక్టు ఇది. అపర భగీరథిగా నిలుస్తుందని ప్రజలంతా కలలు కన్నారు. ఏటా పనుల కోసం కళ్లలో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తూ వస్తున్నారు. వైసీపీ పాలనలో బడ్జెట్‌లో అంకెల గారడీ తప్ప నిధుల కేటాయింపు లేదు. దీంతో ప్రగతి పడకేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా అంచెలంచెలుగా ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలన్న సంకల్పంతో ఉంది. నిర్వాసితులకు పునరావాసం కల్పించి ప్రాజెక్టు నిర్మాణ పనులు జరిపించడానికి శరవేగంగా పావులు కదుపుతోంది. యంత్రాంగం అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించింది.

నెల్లిమర్ల (విజయనగరం), జనవరి 5 (ఆంధ్రజ్యోతి)

విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గంలోని డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో 49 రెవెన్యూ గ్రామాల్లో 24,710 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలన్నది తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. 2014లో టీడీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించి శరవేగంగా పనులను జరిపించింది. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఐదేళ్ల పాటు నిర్లక్ష్యం చేసింది. దీంతో పనులు నత్తనడకన సాగాయి. ఇప్పటివరకూ కేవలం 44 శాతం పనులు పూర్తయినట్టు గణాంకాలు చెబుతున్నాయి. బ్యారేజీకి సంబంధించి 90 శాతం పనులు పూర్తయ్యాయి. డైవర్షన్ కెనాల్స్, టన్నెల్ పనులు 50, జలాశయం పనులు 55, కెనాల్స్ పనులు 80 శాతం పూర్తయ్యాయి. అయితే గత ఐదేళ్లలో బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించారు. తీరా విడుదలకు వచ్చేసరికి మొండిచేయి చూపారు. 2019-20లో రూ.41 కోట్లు కేటాయించారు. రూ.5.63 కోట్లు మాత్రమే విడుదల చేశారు. 2021లో రూ.80 కోట్లకుగాను రూ.23.57 కోట్లు, 2022లో రూ.201 కోట్లకు గాను రూ.28.49 కోట్లు, 2023లో రూ.124.50 కోట్లకు గాను రూ.2.76 కోట్లు, 2024లో 30.27 కోట్లకుగాను రూ.16.58 కోట్లు విడుదల చేశారు.

ఇంకా ఎన్నాళ్లో..

2008లో పూర్తికావాల్సిన ప్రాజెక్టు ఎప్పటికి కొలిక్కి వస్తుందో తెలియడం లేదు. 2005లో దివంగత రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞంలో భాగంగా ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.220 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. 2008 నాటికి పనులు పూర్తిచేస్తామన్నారు. అప్పటి నుంచి పనులు ఆగుతూ.. సాగుతూ వస్తున్నాయి. పునరావాసం, పరిహారం సమస్యలు వెంటాడుతున్నాయి. మొత్తం ప్రాజెక్టుకుగాను రూ.281 కోట్లు కేటాయించగా.. అందులో భూసేకరణకే రూ.201 కోట్లు ఖర్చుచేశారు. మిగతా రూ.80 కోట్లతో పనులు జరిపారు. గత ఏడాది నాబార్డు నిధులు రూ.194 కోట్లు మంజూరుకావడంతో పెండింగ్ పనులు చేపడుతూ వచ్చారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ. 50 కోట్లు కేటాయించినా.. నిధుల మంజూరులో ఆశించిన పురోగతి లేదు. ఇది పనులపై ప్రభావం చూపుతోంది.

లక్ష్యం ఇదే..

ప్రాజెక్టు పూర్తయితే పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాల్లోని 49 గ్రామాల పరిధిలో 24,710 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. ఇందులో కుమిలి చెరువు కింద ఉన్న 8,172 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని స్థిరీకరించవచ్చు. అదనంగా మరో 16,538 ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. మూడు మండలాల్లో తాగునీటి అవసరాలకు 0.162 టీఎంసీల నీటిని వినియోగించుకోవచ్చు. అలాగే విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని సాగునీటి అవసరాలకు మరో 0.48 టీఎంసీల నీటిని తరలించవచ్చు. అసలు విజయనగరంలో తాగునీటి ఇక్కట్లు లేకుండా చూడవచ్చు.


చేయాల్సిన పనులివే..

పెండింగ్ పనులు చాలా ఉన్నాయి. ఏటీ అగ్రహారం, పడాలపేట, కోరాడపేట గ్రామాల్లో నిర్వాసితులకు పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందించాల్సి ఉంది. ప్రాజెక్టుకు 3,446 ఎకరాల భూమి అవసరం ఉండగా.. ఇప్పటివరకూ 3,243 ఎకరాలను సేకరించగలిగారు. చంపావతినదిపై ఆనందపురం వద్ద నిర్మించిన బ్యారేజీ నుంచి కుమిలి వద్ద నిర్మించే జలాశయానికి నీరు తరలించేందుకు డైవర్షన్ కాలువ నిర్మాణం చేపట్టాలి. నెల్లిమర్ల మండలం గొల్లపేట వద్ద కొండలను తొలచి కాలువను నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం ఎస్ఎస్ఆర్ పేట వద్ద టన్నల్ పనులు జరుగుతున్నాయి. ప్రాజెక్టు పరిధిలో 9 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ప్రత్యేకంగా స్లూయిజ్, తూములు నిర్మించాల్సి ఉంది. కుమిలి చెరువు కింద 3500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలంటే తూమును తప్పకుండా నిర్మించాలి. కుమిలి జలాశయం నిర్మాణ పనులు దాదాపు 50 శాతం పెండింగ్‌లోనే ఉన్నాయి. జలాశయం చుట్టూ 9 కిలోమీటర్ల మేర మట్టికట్ట పనులు చేపడుతున్నారు. నాలుగు కిలోమీటర్ల మేర రాతిపేర్పుడు పనులు పూర్తయ్యాయి. ఇంకా ఐదు కిలోమీటర్ల మేర చేపట్టాల్సి ఉంది. ఆనందపురం వద్ద 2.70 టీఎంసీల నీటి ప్రవాహానికి బ్యారేజీ నిర్మాణం చేపడుతున్నారు. 13 తలుపులకుగాను మూడు మాత్రమే ఏర్పాటుచేశారు. మిగతావి ఏర్పాటు చేయాల్సి ఉంది.


సారిపల్లి వద్ద నిర్మాణ దశలో ఉన్న రిజర్వాయర్ గట్టు

సంక్రాంతికి 52 ప్రత్యేక రైళ్లు

- నేటి నుంచి 18వ తేదీ వరకు అందుబాటులో...



హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా పలు ప్రాంతాలకు వెళ్లి వచ్చే ప్రయాణికుల కోసం 52 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 6 నుంచి 18వరకు ఈ రైళ్లు అందుబాటులో ఉంటా యని పేర్కొన్నారు. జనవరి 6, 7 తేదీల్లో చర్లపల్లి-తిరుపతి-చర్లపల్లి (07077/07078), 8, 9, 11, 12, 15, 16 తేదీల్లో చర్లపల్లి-తిరుపతి-చర్లపల్లి (02764/ 02763) మధ్య 6 రైళ్లు అందుబాటులో ఉంటాయి. 13న వికారాబాద్-కాకినాడ టౌన్ (07037), 14న కాకినాడ టౌన్-చర్లపల్లి (07038) మధ్య రైళ్లు నడుస్తాయి. 9, 10, 16, 17 తేదీల్లో కాచిగూడ- తిరుపతి-కాచిగూడ మధ్య నాలుగు, 11, 12, 18, 19 తేదీల్లో చర్లపల్లి-నర్సాపూర్-చర్లపల్లి (07035/07036) మధ్య నాలుగు, 12, 19 తేదీల్లో సికింద్రాబాద్-కాకినాడ టౌన్-సికింద్రాబాద్ మధ్య నాలుగు, జనవరి 7, 8, 9, 10, 13, 14, 15, 16, 17, 18 తేదీల్లో చర్లపల్లి-నర్సాపూర్-చర్లపల్లి (07033/ 07034)మధ్య పది రైళ్లు నడుస్తాయి. 8, 9, 10, 11, 12, 13, 14, 15 చర్లపల్లి-కాకినాడ టౌన్-చర్లపల్లి (07031/ 07032)మధ్య ఎనిమిది, జనవరి 6, 7, 13, 14 తేదీల్లో నాందేడ్-కాకినాడ టౌన్- నాందే డ్ (07487/07488) మధ్య నాలుగు, జన వరి 9, 10, 12, 13, 14, 15 తేదీల్లో చర్లప ల్లి-శ్రీకాకుళం రోడ్-చర్లపల్లి (07025/ 07026) మధ్య ఆరు రైళ్లు అందుబాటులో ఉంటాయి. 7, 8 తేదీల్లో కాచిగూడ-శ్రీకాకుళం రోడ్-కాచిగూడ (07041/ 07042)మధ్య రెండు రైళ్లు నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

స్వగ్రామాలకు చేరుతున్న వలస కూలీలు


తిలారు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సందడి

జలుమూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పనుల నిమిత్తం సుదూర ప్రాంతాలకు వలస వెళ్లిన కూలీలు సంక్రాంతి నేపథ్యంలో స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. సంక్రాంతి మరో వారం రోజులు మాత్రమే ఉండడంతో ఆయా ప్రాంతాల నుంచి రైళ్లు, బస్సుల ద్వారా కుటుంబ సభ్యులతో చేరుతున్నారు. దీంతో రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్లు ప్రయాణికులతో కళకళలాడుతున్నాయి. వీరంతా గ్రామాలకు చేరుకుని బంధువులను కలుస్తూ ఆనందం పొందుతున్నారు.

అంతా ఆన్‌లైన్

- పల్లెకు పాకిన సంస్కృతి ● అన్ని వస్తువుల కొనుగోలు అదే విధానంలో..
- యువతకు పెరిగిన ఉపాధి అవకాశాలు



ఇచ్ఛాపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి)

పట్టణాలు, పల్లెలు అన్న తేడా లేకుండా జిల్లాలో ఆన్‌లైన్ వ్యాపారం జోరుగా సాగుతోంది. చేతిలో సెల్‌ఫోన్ ఉండాలే కానీ క్షణాల్లో తమకు నచ్చి, మెచ్చిన వస్తువులు, కిరాణా, ఆహారం, ఇతరత్రా సామగ్రిని తెచ్చుకుంటున్నారు. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన సంస్కృతి క్రమేపీ పట్టణాలకు, ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించింది. ప్రజలు ఫ్రీ డెలివరీ వస్తువులకే ప్రాధాన్యం ఇస్తున్నారు. వాటినే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని తెప్పించుకుంటున్నారు. అయితే ఆన్‌లైన్ వ్యాపారాల పుణ్యమా అని స్థానిక వ్యాపారాలు మూతపడ్డాయి.


గతంలో గ్రామాల్లో కిరాణా దుకాణాలకు ఎంతో ఆదరణ ఉండేది. అక్కడే అన్ని వస్తువుల విక్రయాలు చేసేవారు. అయితే ఆన్‌లైన్ లావాదేవీల పుణ్యమా అని గడిచిన ఏడాదిలో దేశవ్యాప్తంగా 2 లక్షల కిరాణా దుకాణాలు మూతపడినట్టు జాతీయ వాణిజ్య సంస్థ స్పష్టం చేసింది. మనిషి దైనందిన జీవితం బిజీగా మారింది. ప్రభుత్వ ఉద్యోగాలు కంటే ప్రైవేట్ ఉద్యోగాలే ఇప్పుడు అధికంగా ఉన్నాయి. ప్రైవేట్ సెక్టారు అంటే ఉరుకులు, పరుగులు పెట్టాల్సి ఉంటుంది. అదే సమయంలో భర్తతో పాటు భార్య పనిచేయాల్సి పరిస్థితి నెలకొంది. అటువంటి వారు ఇంటి అవసరాల కోసం తమ సమయాన్ని కేటాయించే పరిస్థితి ఉండదు. అందుకే వారు ఎక్కువగా ఆన్‌లైన్ ఆర్డర్ల వైపు మొగ్గు చూపుతున్నారు.

తగ్గిపోతున్న దుకాణాలు..

ఆన్‌లైన్ వ్యాపారాలు మూలంగానే ఇండియన్ రిటైల్ రంగంలో కిరాణా దుకాణాలతో పాటు ప్రజలకు అవసరమైన వస్తువులు విక్రయించే షాపుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పడుతుందని జాతీయ సంస్థలు అంచనాలను వెల్లడిస్తున్నాయి. రాబోయే ఐదేళ్లలో ఆన్‌లైన్ సంస్థలు 1500 శాతం వృద్ధి సాధిస్తాయని చెప్పడం బట్టి అర్థమవుతోంది. అంటే ఏడాదికేడాది 300 శాతం తమ సేవలను విస్తరిస్తాయన్న మాట. అటు ప్రభుత్వానికి సైతం పన్నుల రూపంలో ఆదాయం పెరిగే అవకాశం ఉంది. రాబోయే రెండు, మూడు సంవత్సరాల్లో ప్రభుత్వానికి 300 నుంచి 400 మిలియన్లు ఆదాయం సమకూరుతుందని వాణిజ్య నిపుణులు చెబుతున్నారు. అటు ఈ రంగంలో ఉద్యోగుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటివరకూ ఈ సంస్థల్లో సగటు ఉద్యోగికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ జీతం ఉండేది. కానీ ఇప్పుడు రూ.25 వేలకు పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయి. భారతీయ రైల్వే కంటే ఈ రంగంలో ఉద్యోగాల భర్తీ పెరుగుతుందని తెలుస్తోంది.

యువతకు ఉపాధి..

ప్రస్తుతం పట్టణంలో అమేజాన్, క్లిప్‌కాట్, డెలివరీ డాట్‌కమ్, ఎక్స్‌ప్రెస్ ఇలా చాలా సంస్థలు తమ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వాటివల్ల స్థానిక నిరుద్యోగ యువత పనుల్లో చేరి జీవితాన్ని గడుపుతున్నారు.



ఇచ్ఛాపురం పట్టణంలో ఆన్‌లైన్ వస్తువులు డెలివరీ చేస్తున్న బాయ్స్

- ఈయన పేరు సింహాచలం.

ఇచ్ఛాపురం మునిసిపాలిటి గొల్లవీధికి చెందిన ఈయన ఆన్‌లైన్ డెలివరీ బాయ్. పట్టణాల కంటే గ్రామీణ ప్రాంత ప్రజలే ఎక్కువగా ఆన్‌లైన్ మార్కెట్ చేస్తుంటారని సదరు యువకుడు చెబుతున్నాడు. రోజుకు 50 కిలోమీటర్లు తిరుగుతామని తెలిపాడు. 'మొదట్లో పార్శిల్ బట్టి కమీషన్ వచ్చేది. ప్రస్తుతం నెలకు రూ.13వేలు వస్తోంది. ఈ వర్క్ హ్యాపీగానే ఉంది. రోజుకి వంద పార్శిల్స్ వచ్చినా.. ఒక్కటి వచ్చినా జీతం మాత్రం ఒక్కటే. ఈ ఉద్యోగం చాలా ఆనందాన్ని కలిగిస్తోంద'ని సింహాచలం తెలిపాడు.

- అన్నింటా ఆదా..

ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలుతో సమయంతో పాటు డబ్బులు ఆదా అవుతోంది. అందుకు తగ్గట్టు ఆన్‌లైన్ వ్యాపార సంస్థలు కూడా నాణ్యతకు పెద్దపీట వేస్తున్నాయి. వివిధ పనులపై బయటకు వెళ్లినవారు ఇంటికి చేరే లోపు నిత్యావసరాలతో పాటు ఆహారం కూడా ఇట్టే చేరిపోతుంది. ముఖ్యంగా దంపతులిద్దరూ ఉద్యోగాలు చేస్తే వారికి క్విక్ కామర్స్ సంస్థలే కుటుంబ సభ్యులు అండగా నిలుస్తాయి.

-తిప్పన లక్ష్మణరావురెడ్డి
స్థానికుడు, ఇచ్ఛాపురం

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా!

- అస్తవ్యస్తంగా ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానం
- మందుబాబులు, జూదరులకు నిలయంగా..
- పట్టించుకోని అధికారులు

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానం మందుబాబులు, జూదరులకు అడ్డాగా మారింది. కొందరు వ్యక్తులు రాత్రిపూట మైదానంలోకి ప్రవేశించి మద్యం తాగి సీసాలను పడేస్తున్నారు. మరికొందరు పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. మలమూత్ర విసర్జన కూడా అక్కడే చేస్తున్నారు. అలాగే, మైదానంలోని ఎన్టీఆర్ కళా వేదిక వెనుక భాగంలో చెత్తాచెదారం పారబోస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర దుర్వాసన వెదజల్లుతుంది. రాత్రిపూట ఈ మైదానంలో వాచ్‌మన్‌ని ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా మైదానంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


మైదానంలో పడేసిన ఖాళీ మద్యం సీసాలు


చెత్తాచెదారంతో వేదిక వెనుక భాగం

జిల్లాస్థాయి రంగోత్సవం రేపు

గుజరాతీపేట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఈ నెల 7వ తేదీన జిల్లాస్థాయి రంగోత్సవాన్ని నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. రంగోత్సవంలో ఎనిమిది అంశాలకు సంబంధించి పోటీలు జరుగుతాయన్నారు. క్విజ్‌లో పంజాబ్, ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, చరిత్ర, జాగ్రఫీ తదితర అంశాలపై 20 ప్రశ్నలు, చిత్రలేఖనంలో భారతీయ స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు, చేతిరాత పోటీల్లో తెలుగు, ఇంగ్లీషు పేరాగ్రాఫ్, ఒక కొటేషన్, నలుగురు, ఐదుగురు లోపు విద్యార్థులతో రంగోలి ఉంటాయన్నారు. పంజాబ్, ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి సంప్రదాయ జానపద నృత్యం, డిజిటల్ పోస్టల్ తయారీలో సమైక్య, సమగ్రత భావనపై అంశం, నినాదాల తయారీలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ భావన, రోల్ ప్లేలో భారతీయ సంస్కృతి చరిత్ర విలువలపై ఒక రోల్ ప్లే చేయాల్సి ఉంటుందన్నారు. ఇందులో 6 నుంచి 12వ తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు అర్హులన్నారు.

9 నుంచి క్రికెట్ టోర్నమెంట్

ఆమదాలవలస, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జనవరి 9వ తేదీ నుంచి ఏపీఎల్ సూపర్‌సిక్స్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు సనపల మోహన్ సురేష్, కామినేని సంతోష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్ తమ్మినేని విద్యాసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.2 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, బెస్ట్ బ్యాట్స్‌మన్‌కి, బెస్ట్ బౌలర్‌కు రూ.2 వేలు చొప్పున అందించనున్నట్టు తెలిపారు. వివరాలకు 9491533123 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

ట్రాన్స్‌కో ఏఈ లేక అవస్థలు

నందిగాం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలానికి పూర్తిస్థాయి ట్రాన్స్‌కో ఏఈ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అతిపెద్ద మండలాల్లో ఒకటైన నందిగాం మండలంలో నందిగాం, కొత్తగ్రహారం, మదనాపురంలో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. అయితే మూడున్నరేళ్లుగా ఏఈ పోస్టు ఖాళీగా ఉండి ఇన్‌చార్జిలతోనే కాలక్షేపం చేస్తుండడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండిపోయి ఇటు సిబ్బందికి, అటు వినియోగ దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సబ్‌ఇంజనీర్ నేతృత్వంలోనే పనులు సాగుతుండగా టెక్కలి ఏడీఈ కృష్ణమూర్తి మండలానికి సంబంధించిన బాధ్యతలు చూస్తుండడంతో మండలంలోని విద్యుత్ సమస్యలు సకాలంలో పరిష్కారం కావడం లేదని, కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా మండలానికి పూర్తిస్థాయి ఏఈని నియమించాలని కోరుతున్నారు.

ఆదిత్యుని ఆదాయం రూ.1.64 లక్షలు

అరసవల్లి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి ఆదివారం ఒక్కరోజు రూ.1,64,948 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ. 21,400, విరాళాల ద్వారా రూ.54,483, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.89,065 లభించిందని ఆలయ ఈవో వై.భద్రాజీ తెలిపారు.

నారాయణ సేవ

ఆమదాలవలస, జనవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక మెట్టక్కివలస సాయిశృతి మందిరం ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు నారాయణ సేవ కార్యక్రమంలో భాగంగా భోజనంతోపాటు పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్ర యువత పత్తియాత్రలో భాగంగా జాతీయ నారాయణసేవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కన్వీనర్ కేవీ కామవదాను ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా సత్యసాయి సమితి వివిధ విభాగాలకు చెందిన ఎం.రవీంద్రబాబు, పి.తాతయ్య, ఎస్‌జీ రమణ, కేవీ వెంకటరమణమూర్తి, ఎ.రామకృష్ణ, బి.జగన్నాథరావు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం


సాయం అందిస్తున్న భజన మండలి ప్రతినిధులు

గార, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కుమ్మరిపేట గ్రామానికి చెందిన కుమ్మరి రమాదేవి కేన్సర్ వ్యాధితో బాధపడుతుంది. ఆమె వైద్యానికి రూ.10 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో బోరవానిపేటకు చెందిన సత్యసాయి భజన మండలి ప్రతినిధులు ఆదివారం రూ.35 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్ నరసింహ రౌలో, సేవాదళ్ కన్వీనర్ బోర సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పోరాడే నాయకుడు.. 'చౌదరి'

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు


పురుషోత్తం నాయుడును గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): సమాజం కోసం పోరాడే కుటుంబంలో పుట్టి ఉద్యోగ సంఘ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన నాయకుడు చౌదరి పురుషోత్తం నాయుడని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏపీఎన్జీవో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, వాణిజ్య పన్నుల శాఖ అధికారిగా విధులు నిర్వహించిన చౌదరి పురుషోత్తంనాయుడు పదవీ విరమణ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభలో కేంద్రమంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలపై చేసిన పోరాటం ఆయనకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చిందన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.శివారెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగిగా జీవితం ప్రారంభించి గొప్ప నాయకుడిగా ఎదిగి తల్లిదండ్రులు, తోటి ఉద్యోగుల సమక్షంలోనే పదవీ విరమణ చేయడం గొప్పవిషయమన్నారు. అనంతరం ఉద్యోగ సంఘ నాయకులు పురుషోత్తం నాయుడు, అరుణమ్మ దంపలతును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఎన్జీవో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ రవిశంకర్, రాష్ట్ర, జిల్లా సంఘ నాయకులు జేవీఎం శర్మ, తోట రాజశేఖర్, బి.నాగరాజు, మురళీకృష్ణ, నిర్మలాజ్యోతి, ఎ.రమేష్, హనుమంతు సాయిరాం ,చల్లా శ్రీనివాసరావు, శ్యామ్, రాణిమోహన్, కె.పద్మజ, చౌదరి బాబ్జి, ధనలక్ష్మి, జాన్ భాషా, చంద్రశేఖర్, చౌదరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంలో 'తెరవే' పాత్ర అద్వితీయం

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం సాహిత్యంలో తెలుగు రచయితల వేదిక (తెరవే) పాత్ర అద్వితీయమని ఎచ్చెర్ల అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కేఆర్ రజిని అన్నారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఉత్తరావలి నాగేశ్వరరావు, ఆర్‌వీ రమణమూర్తి ఆధ్వర్యంలో 100 నెలలు పూర్తయిన సందర్భంగా తెరవే శతమాన సాహితీ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వర్సిటీ వీసీ మాట్లాడుతూ.. కవులు సహృదయులని, సమాజంలోని రుగ్మతలపై తమ రచనలతో ప్రజలను చైతన్యం చేయడంలో కీలకపాత్ర వహిస్తారన్నారు. రిటైర్డు సీఈవో సురంగి మోహన్‌రావు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్ రావు, రిటైర్డు డీఈవో బలివాడ మల్లేశ్వరరావు, రచయిత కొనే శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గం

సోంపేట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక శైలజ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడిగా మల్లా నాగేంద్ర, కార్యదర్శిగా కొంచాడ శ్రీను, ఉపాధ్యక్షులుగా బరాటం సురేష్, సానా శ్రీకాంత్, కోశాధికారిగా సానా రవిని ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి గౌతు శివాజీ హాజరై మాట్లాడారు. వ్యాపారులు కలసికట్టుగా ఉండాలని, వ్యాపార అభివృద్ధికి సహకరించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ వీఎం గాంధీ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

బూర్జ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సందడిగా సాగింది. ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రిటైర్డు ఉపాధ్యాయులు చ క్రపాణి, సత్యనారాయణ, ఎల్‌కే నరసింహమూర్తి, మహేష్, స్థానిక హెచ్‌ఎం చల్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు సేవా భావం కలిగి ఉండాలన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకొని మానవతా దృక్పథం అలవర్చుకోవాలన్నారు. అనంతరం పూర్వ విద్యారులు ఆటలు, పాటలతో సందడిగా గడిపారు. క్విజ్, డ్యాన్స్, ఇతర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎన్ఈఆర్


లోకేశ్‌తో ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం వచ్చిన మంత్రి లోకేశ్‌ను ఆదివారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కలిశారు. ఆయనతో కొంతసమయం గడిపారు. ఎచ్చెర్ల నియోజకవర్గం సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

బీసీలంతా ఏకం కావాలి

శ్రీకాకుళం అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): 'ఉత్తరాంధ్ర రాజకీయాలను కమ్మలు, రెడ్లు, ఇతరులు ఆక్రమించుకున్నారు. ఇక్కడి ప్రజల కష్టాలు, ఆకాంక్షలు, అవసరాలను పట్టించుకోకుండా రాజకీయం చేస్తున్నారు. రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు బీసీలంతా ఏకమవ్వాల్సిన సమయం ఆసన్నమైంది.' అని ఉత్తరాంధ్ర బీసీ సంఘాల నాయకులు అన్నారు. ఆదివారం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఇలిసిపురంలోని అంబేద్కర్ విజ్ఞాన్ భవన్‌లో బీసీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రలో కొన్ని కులాల వ్యక్తులకు మాత్రమే టిక్కెట్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర చైర్మన్ ఎ.పూర్ణచంద్రరావు, కన్వీనర్ బీసీ రమణ, నాయకులు కె.శ్రీనివాస్ యాదవ్, రాజారావు, గుణుపూర్ పర్మింగ్ యాదవ్, రౌతు శంకర్, దుప్పల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేహదారుఢ్య పరీక్ష వాయిదా

శ్రీకాకుళం క్రైం/ఎచ్చెర్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు మైదానంలో జరగాల్సిన కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షను 11వ తేదీకి వాయిదా వేసినట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైకుంఠ ఏకాదశి, ఇతర శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా పరీక్షను వాయిదా వేసినట్లు చెప్పారు. మిగిలిన తేదీల్లో జరగాల్సిన దేహదారుఢ్య పరీక్షలు యధావిధిగా జరుగుతాయని అన్నారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని ఎస్పీ కోరారు.

కల్తీ డీజిల్ విక్రయం

- బంక్ వద్ద ట్రాక్టర్ యజమాని ఆందోళన


బంకు వద్ద ఆందోళన చేస్తున్న ట్రాక్టర్ యజమాని

నరసన్నపేట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): గుండవల్లిపేట వద్ద ఓ పెట్రోల్ బంక్‌లో కల్తీ డీజిల్ విక్రయించడంపై జలుమూరు మండలం తాళ్లవలసకి చెందిన కూర్మారావు ఆరోపించారు. ఆదివారం రాత్రి క్యాన్‌లో డీజిల్ కొట్టించి పొలంలో ఉన్న ట్రాక్టర్‌లో వేసిన కొద్ది సమయానికి ట్రాక్టర్ ఇంజిన్‌లో సాంకేతిక లోపం వచ్చిందని, మెకానిక్‌కు చూపించగా ఇంజిన్‌లో ఆయిల్‌లో నీరు చేరినట్లు చెప్పారని వాపోయాడు. దీంతో బంకువద్దకు వచ్చి ఆందోళన చేశారు. దీనిపై బంకు సిబ్బందిని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

'వైసీపీ వక్రబుద్ధి మారలేదు'


విలేకరులతో మాట్లాడుతున్న విద్యాసాగర్

ఆమదాలవలస, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పినప్పటికీ ఇంకా వక్రబుద్ధితో తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టడం సిగ్గుచేటని టీడీపీ న్యాయ విభాగం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు నూక అప్పల సూరన్నాయుడు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను రాజకీయాల్లో ఎటువంటి ప్రజా ప్రతినిధిగా ఎన్నిక కాని వైసీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అసత్య ఆరోపణలు విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అసత్య ఆరోపణలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి బోర గోవిందరావు, నారాయణపురం ప్రాజెక్టు చైర్మన్ సనపల ఢిల్లీశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్.మురళీధరరావు, బీసీ సెల్ అధ్యక్షుడు తంగి గురయ్య, కె.రమణమూర్తి పాల్గొన్నారు.

జనావాసాల్లోకి జింక పిల్ల



కవిటి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): సోంపేట మండలంలోని బుషాభద్ర గ్రామ సమీపంలో జింకపిల్ల ఆదివారం ఉదయం కనిపించింది. అది కుక్కలబారిన పడకుండా ఆ గ్రామస్థులు కాపాడి పట్టుకున్నారు. అనంతరం రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే బెందాళం అశోక్ నివాసం వద్దకు చేర్చారు. ఈ విషయాన్ని అధికారులకు తెలియజేయడంతో ఫారెస్టు రేంజర్ మురళీకృష్ణ, సిబ్బంది చేరుకొని జింక ఎల్లను పరిశీలించారు. అనంతరం దానిని తీసుకుని వెళ్లి సుంకిడి ఫారెస్టులో విడిచిపెట్టారు. కార్యక్రమంలో మందస ఫారెస్టురేంజర్ రాము, సెక్షన్ ఆఫీసర్ రాఘవయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు జిల్లా క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు జిల్లా నుంచి ఐదుగురు క్రీడాకారులు ఎంపికై రాష్ట్ర జట్టు తరుపున ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు కబడ్డీ సంఘం జిల్లా చైర్మన్, ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఇందులో ఇద్దరు బాలురు, ముగ్గురు బాలికలు ఉన్నారన్నారు. ఉత్తరాఖండ్‌లో గల హరిద్వార్‌లో ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న పోటీలకు సీతంపేట మండలం జిల్లేడుపాడుకు చెందిన పాలక మణికంఠ, జలుమూరు మండలం ముట్టవానిపేటకు చెందిన ముద్దాడ నరేష్, వజ్రపుకొత్తూరు మండలం పల్లిసారిథికి చెందిన తామాడ లిసా, సంగారి హర్షిత, లావేరు మండలం నాగంపాలెం గ్రామానికి చెందిన కందివలన శ్రావణి పాల్గొంటారన్నారు. ఇంతటి ఘనకీర్తిని తీసుకువచ్చిన క్రీడాకారులను జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు నక్క రామకృష్ణ, కార్యదర్శి సాధు ముసలినాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సాధు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు మెట్ట తిరుపతిరావు, కోశాధికారి ఎన్.రమేష్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, గౌరవ సలహాదారు పి.సుందరరావు, జిల్లా పీఈటీ, పీడీ సంఘం అధ్యక్షుడు ఎంవీ రమణ, అభినందించారు.

కోడి పందాలపై దాడి

ఎచ్చెర్ల, జనవరి 5(ఆంధ్రజ్యోతి): చినకొంగరాం సమీపంలోని తోటల్లో నిర్వహిస్తున్న కోడిపందాల శిబిరంపై ఎచ్చెర్ల పోలీసులు ఆదివారం మెరుపు దాడి చేశారు. 25 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.38 వేల నగదు, 16 ద్విచక్ర వాహనాలు, 20 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలి


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

పొందూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): గెలుపు ఓటమిలతో సంబంధం లేకండా క్రీడా స్ఫూర్తిని ప్రతి ఒక్క క్రీడాకారుడు కలిగి ఉండాలని టీడీపీ మండల మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగిడి లక్ష్మి అన్నారు. మేజరు పంచాయతీ పరిధి జోగన్నపేటకు చెందిన సర్వోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. 32 జట్లు పాల్గొంటున్నట్టు నిర్వాహకులు తెలిపారు. తండ్యాం సమీపంలో సన్‌సిటీలో పోటీలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వడగా మోహన్, బాడాన గిరి, కె.శ్రీనివాసరావు, చందక ఆది తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోటీలు

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పిల్లలకు సంక్రాంతి పండగ చర్చ గోష్టి, క్విజ్, దేశభక్తి గేయాల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా లోకనాథం నందికేశ్వరరావు, బీఎంఎస్ పట్నాయక్, హరి సత్యనారాయణ, డ్రాయింగ్ టీచర్ సాయి ప్రసాద్, సోడవరం ఈశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ ప్రాధాన్యత విశిష్టతపై పిల్లలచే మాట్లాడించడం జరిగింది. అనంతరం మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆమె నేత్రాలు సజీవం


రాజేశ్వరి (ఫైల్)

అరసవల్లి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని చేపలవీధిలో నివాసం ఉంటున్న జామి రాజేశ్వరి(88) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె నేత్రాలను దానం చేయాలని నిర్ణయించుకున్న కుటుంబసభ్యులు.. రెడ్‌క్రాస్‌కు సమాచారం అందించారు. దీంతో టెక్నీషియన్ పి.సుజాత, అసిస్టెంట్ ఉమాశంకర్ అక్కడికి చేరుకుని రాజేశ్వరి కళ్ల నుంచి కార్నియాలు సేకరించారు. వాటిని విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి తరలించారు. తాను మరణించినా ఆమె మరో ఇద్దరికి వెలుగును ప్రసాదించిన రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ జగన్మోహనరావు, కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, దుర్గా శ్రీనివాస్ కొనియాడి, ఘనంగా నివాళులర్పించారు.

శివాలయానికి పోటెత్తిన భక్తులు


స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

సోంపేట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పుష్య ఆదివారం కావడంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచే స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తెలుకల కులస్థులను ఆదుకోవాలి

టెక్కలి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): అఖిలగాండ్ల తెలుకల కులస్థులను ఆదుకోవాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కేఎల్ ప్రసాద్, సీనియర్ నాయకులు ఇ.విశ్వనాథం అన్నారు. ఆదివారం అక్కవరం సమీపంలో దాసరి జ్ఞానమూర్తి అధ్యక్షతన 'వనం-మనం' కార్యక్రమం నిర్వహించారు. బీసీ డిక్లరేషన్ ప్రాతిపదికన తెలుకల కులాలకు 300 ఉచిత విద్యుత్ యూనిట్లు అందించాలని, టెక్కలిలో కుల సామాజిక భవనం నిర్మాణం చేయాలని కోరారు. సంఘ నాయకులు రామరాజు, ధర్మరాజు, జగన్, మధు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ

పలాస రూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కైజోలకు చెందిన టీడీపీ కార్యకర్త తెప్పల ఆదినారాయణ అనారోగ్యంతో విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడంతో ఆదివారం ఎమ్మెల్యే గౌతు శిరీష పరామర్శించారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

పొందూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆదివారం ఆటో, వాహన డ్రైవర్లతో రోడ్డు ప్రమాదాలు, నివారణపై ఎస్ఐ వి.సత్యనారాయణ అవగాహన కల్పించారు.

వృథాగా.. అగ్రిల్యాబ్‌లు

(ఐదో పేజీ తరువాయి)

కనీసం అరకేజీ విత్తనాలు అగ్రిల్యాబ్‌కు తీసుకురావాలి. వాటిని పరీక్షించి.. వారం రోజుల్లో విత్తన నాణ్యతా ప్రమాణాలు వెల్లడిస్తారు. రైతులకు ఈ పరీక్షలు ఉచితమే. మిగిలినవారు కొంత రుసుం ల్యాబ్‌కు చెల్లించాలి. ఎరువులకు సంబంధించి నాణ్యతా ప్రమాణాలు తెలుసుకోవాలంటే కనీసం 400 గ్రాములు అందజేయాలి. వీటి నాణ్యతా ప్రమాణాల పనితీరు 48గంటల్లో వెల్లడిస్తారు. రైతులకు ఉచితం కాగా స్థానికేతరులకైతే కనీసం రూ.500 చెల్లించాలి. ఎరువుల నాణ్యత పరిశీలనకు అవసరమయ్యే కెమికల్స్‌కు గాను కనీసం రూ.5లక్షలు నిధులు కేటాయించాల్సి ఉంది. కాగా.. అగ్రిల్యాబ్‌లు ప్రారంభించినా.. పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇటు భవన నిర్మాణానికి, అటు సాంకేతిక పరి కరాలకు కోట్ల రూపాయలు వెచ్చించినా.. ప్రయోజనం లేకపోతోందని వాపోతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి అగ్రిల్యాబ్‌లు వినియోగించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

క్రైం కార్నర్

త్రుటిలో తప్పిన ముప్పు

● హైవేపై కోత యంత్రాన్ని ఢీకొన్న కారు



గుండువల్లిపేట వద్ద నూర్పిడి యంత్రాన్ని ఢీకొన్న కారు

నరసన్నపేట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): గుండువల్లిపేట వద్ద హైవేపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. జార్ఖండ్ రాష్ట్రం నుంచి విశాఖపట్నం కారులో వెళుతున్న మనోజ్ రోడ్డుపై నిలిపి ఉన్న నూర్పిడి యంత్రాన్ని బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జుకాగా అందులో ఉన్న మనోజ్ తల్లి మమత, సోదరి పూజ స్వల్పగాయాలతో బయటపడ్డారు. అయితే మనోకు ఎటువంటి గాయాలు కాలేదు. అయితే త్రుటిలో భారీ ప్రమా దం తప్పింది. క్షతగాత్రులను 108వాహనంలోస్థానికులు నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేశారు. ఘటన ప్రాంతాన్ని పోలీసులు పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయాల్సి ఉందని ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

వెండి వస్తువుల పట్టివేత



స్వాధీనం చేసుకున్న వెండి వస్తువులు

రణస్థలం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం బరంపురం నుంచి విజయనగరం తరలిస్తున్న 14 కిలోల వెండి వస్తువులను జేఆర్ పురం పోలీ సులు పట్టుకున్నారు. ఆదివారం పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. బరంపురానికి చెందిన పుష్పేంద్ర సింగ్ వద్ద ఎటువంటి బిల్లు లేకుండా 14 కిలోల వెండి వస్తువులు ఉన్నట్టు గుర్తించినట్టు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. స్వాధీనం చేసుకున్న వెండి సామగ్రితోపాటు పుష్పేంద్ర సింగ్‌ను జీఎస్‌టీ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఆమదాలవలస, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కోటిపల్లి రాజు (23)పై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సనపల బాలరాజు తెలిపారు. 14 ఏళ్ల బాలికకు రాజు మాయమాటలు చెప్పి లొంగదీసుకుని గర్భవతిని చేశాడని, ఆ బాలిక తల్లి ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. 9వ తరగతి చదువుతున్న ఆ బాలికను లోబర్చుకుని గత రెండేళ్లుగా అత్యా చారానికి పాల్పడినట్టు ఆమె తల్లి ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని, శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

రెండు వరిచేను కుప్పలు దగ్ధం



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన వరి చేను కుప్పలు

నందిగాం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కణితివూరులో శనివారం అర్ధరాత్రి రెండు వరి చేను కుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన గిన్ని మల్లేశ్వరరావు రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని సాగుచేసి పంటను పొలంలోనే కుప్పలుగా పెట్టాడు. ఆదివారం ఉదయం చేను కుప్పలు అగ్నికి ఆహుతైన విషయం గుర్తించి స్థానిక పెద్దలకు తెలపడంతో టెక్కలి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక అధికారి బి.సూర్యారావు నేతృత్వంలో సిబ్బంది చేరుకున్నప్పటికీ రెండుకుప్పలు పూర్తిగా దగ్ధమైపోయాయి. అయితే గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టి ఉంటారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. నీటి సంఘం అధ్యక్షుడు కవిటి విశ్వనాథం ప్రమాద విషయాన్ని తహసీల్దార్ పెద్దింటి సోమేశ్వరరావుకు తెలియజేశారు. వీఆర్వో కె.ప్రసాదరావు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

మెళియాపుట్టి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి సమీపంలో పట్టపగలే అందరూ చూస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు మహిళ మెడలోని గొలుసు చోరీ చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. కోటబొమ్మాళి మండలం సుబ్బరాయుడుపేట గ్రామానికి చెందిన బాడాన రమణమ్మ భర్త అప్పన్నతో కలిసి ఆదివారం కొసమాళలో ఉన్న తన కోడలిని చూసేందుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా మెళియాపుట్టి ఏకలవ్య పాఠశాల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి రమణమ్మ మెడలో ఉన్న సుమారు మూడు తులాల చైన్ దొంగిలించి పరారయ్యారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాజకీయం అడుక్కుంటే రాదు.. మనం లాక్కోవాలి

● తూర్పుకాపు ఆత్మీయ సమ్మేళనంలో వైసీపీ ఎమ్మెల్సీ బొత్స



మాట్లాడుతున్న బొత్స

టెక్కలి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాజకీయం అనేది అడుక్కుంటే రాదని, మనం లాక్కోవాలని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. ఆదివారం టెక్కలి సమీపంలో తూర్పుకాపుల ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ జిల్లాలో తూర్పు కాపు సంక్షేమ భవనం నిర్మాణంలో సంఘ నాయకు లందరం వైఫల్యం చెందామన్నారు. జిల్లా లో ఉన్న కాపు నాయకులు ఒక మాట మీదకు రావాల్సి ఉందన్నారు. తూర్పుకాపు రాష్ట్ర చైర్మన్ పాలవలస యశస్విని మాట్లా డుతూ.. కులాన్ని గౌరవించడం అలవర్చుకోవాలని, అవసరమైతే ప్రోత్సహిం చాలన్నారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ కె.రవి, టీడీపీ నాయకుడు కిమిడి రామమల్లిక్ నాయుడు, జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, ఆనెపు రామకృష్ణ, డీసీసీబీ మాజీ అధ్యక్షులు డోల జగన్, కరిమి రాజేశ్వరరావు, తూర్పు కాపు సంఘ జిల్లా అధ్యక్షుడు సురంగి మోహనరావు, పలువురు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీసీసీ స్టోర్సు సభ్యుల ఎన్నిక

కోటబొమ్మాళి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి కన్స్యూమర్ కోపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ (సీసీసీ స్టోర్సు) ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా కోరాడ అప్పలసాయన్న, ఉపా ధ్యక్షుడిగా లొట్టి రామారావులతో పాటు డైరెక్టర్లు, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు, నాయకులు కోరాడ గోవిందరావు, సకలాభక్తుల రామ్ కుమార్, బోయిన వెంకటరమణ, కోరాడ చిన్న గోవింద, సకలాభక్తుల వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

బిక్కు బిక్కుమంటూ విధులు

● శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం
● పట్టించుకోని అధికారులు





శిథిల భవనంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది (ఇన్‌సెట్‌లో) అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ లైన్లు

హిరమండలం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): హిరమండలం తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో సిబ్బంది బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఏ మాత్రం వర్షం పడినా గోడల్లో నీరు చేరడంతో పాటు స్లాబ్ పెచ్చులు ఊడిపడు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గతంలోనూ అనేక పర్యాయాలు సిబ్బంది విధుల్లో ఉండగా స్లాబ్ పెచ్చులూడి పడిన ఘటనలు ఉన్నాయి. ఉన్నతాధికారులు ఈ కార్యాలయానికి వచ్చి వెళుతున్నా పట్టించుకోవడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. సుమారు 30 ఏళ్ల కిందట భవనం నిర్మించగా ఆ తరువాత ఎటువంటి నిర్వహణ లేకపోవడంతో తహసీల్దార్ చాంబర్‌తో పాటు సర్వేయర్ గది, రికార్డులు భద్ర పరిచే గదులు బీటలు వారి పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. రికార్డులు పాడవుతున్నాయన్న ఆవేదన వ్యక్తమవుతోంది. కార్యా లయంలో విద్యుత్ లైన్లు కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఎప్పు డు షార్ట్ సర్క్యూట్ అవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం మరమ్మతులకు ఒక్కపైసా కూడా కేటాయించలేదు. దీంతో భవనం ఎప్పుడు కూలి పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికా రులు స్పందించి కార్యాలయం మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

జలుమూరులో వ్యవసాయ కార్యాలయం..



శిథిలావస్థలో ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయం

జలుమూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జలుమూరులో నిర్మించిన వ్యవసాయ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. భవనం నిర్మించి 20 ఏళ్లు కాగా ఎటువంటి మరమ్మతులు లేక భవనం పైకప్పు పెచ్చులూడి ప్రమాద కరంగా తయారైంది. కొండ పక్కన ఉండడం, భవనం షట్టర్లు పాడవడంతో విష పురుగులు, సర్పాలు కార్యాలయంలోకి చేరుతున్నాయని, దీంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కార్యాలయంలో మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళా సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవనానికి మరమ్మతులు చేపట్టి సదుపాయాలు కల్పించాలని సిబ్బంది, రైతులు కోరుతున్నారు.

వజ్రపుకొత్తూరు తహసీల్దార్ కార్యాలయం..

వజ్రపుకొత్తూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పటికే భవనం స్లాబ్ పెచ్చులూడి, గోడలు పగుళ్లు ఏర్పడడంతో సిబ్బంది బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల చిన్న మరమ్మతులు చేపట్టినా ప్రయోజనం కనిపించ లేదు. దీంతో వివి ధ పనులపై వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న తహసీల్దార్ కార్యాలయ భవనం

న్యూస్ బాక్స్

డీలర్ పోస్టులకు దరఖాస్తులు

పోలాకి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 రేషన్ డీలర్ డిపో పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తహసీల్దార్ ఎం.సురేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పల్లిపేట, చీడివలస, జిల్లేడువలస, ప్రియాగ్రహారం, రామయ్యవలస, సుసరాం, మబగాం, కొత్తరేవు, వనవిష్ణుపురం, పోలాకి, సత్రవుపేట గ్రామాల్లో డీలర్ పోస్టుల ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులను ఈనెల 23వ తేదీలోగా పంపాలని ఆయన పేర్కొన్నారు.

వివేకానందుని ఆశయాలను కొనసాగించాలి

జలుమూరు, (సారవకోట), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద ఆశయాలను నెరవేర్చేందుకు యువత ముందుకు రావాలని విజయాంబికా యువజన సంఘం అధ్యక్షుడు చల్ల ఆనందరావు కోరారు. అలుదు గ్రామంలో వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజేతలకు ఈనెల 12న బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అలుదు ఉన్నత పాఠశాల హెచ్ఎం తంప రామారావు, ఉపాధ్యాయుడు గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఒడియా బ్రాహ్మణ సంఘం బలోపేతానికి కృషి చేయాలి

వజ్రపుకొత్తూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఒడియా బ్రాహ్మణ సంఘ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ సంఘ అధ్యక్షుడు చంద్రశేఖర త్యాడి, కార్యదర్శి బాబూరావు పండా అన్నారు. అక్కుపల్లి బీచ్‌లో ఆదివారం ఒడియా బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం నిర్వ హించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పేద ఒడి యా బ్రాహ్మణులకు యజ్ఞోపవీతధారణ, ఏప్రిల్ ఒకటిన ఒడియా దినోత్సవం నిర్వహించేందుకు తీర్మానించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు రాఘవపండా, ప్రసాద్ పాత్రో, సంతోష్ కుమార్, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

టెక్కలి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఒక ప్రకటన లో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగి, 18 నుంచి 45 ఏళ్ల వయసున్న నిరుద్యోగ యువత పాల్గొనవచ్చన్నారు. మంగళవారం ఉదయం ఉదయం 9గంటల నుంచి జరుగు జాబ్‌మేళాలో రెండు బహుళజాతి కంపెనీలు పాల్గొంటాయని, అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వ హించి ఎంపిక చేస్తారన్నారు. విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, బయోడేటా, పాస్‌పోర్టుసైజు ఫొటోతో హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 9493290012 నెంబరులో సంప్రదించాలని కోరారు.

దాడి చేయడం దారుణం

పలాసరూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్ వీక్షణం బుక్‌స్టాల్‌పై, ఎడిటర్ వేణుగోపాల్‌పై గత నెల 29న దాడి చేయడం దారుణమని, దీనిని ప్రజాస్వామ్యవాదులు ఖం డించాలని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం లో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. రాజ్యాంగం ప్రకారం శాస్త్రీయ భావజాలాన్ని ప్రకటించడం ప్రతి ఒక్కరి నైతిక హక్కు అని, అయితే నేడు మతోన్మాద శక్తులు వాటిని అడ్డుకోవడమే కాకుండా భౌతికంగా నిర్మూలిస్తామని చెప్పడం అప్రజాస్వామికమన్నారు. సమావేశంలో పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పత్రి దానేసు, జిల్లా కార్యదర్శి పిండి వెంకట్రావు, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ నాయ కులు సాలిన వీరాస్వామి, దుర్యోధన, గంగయ్య, ఎర్రయ్య, సీపీఐఎంఎల్ నాయకులు కె.రమేష్, దిలీప్ పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా కూటమి ప్రభుత్వం



పాలిన వీరాస్వామి భార్య పార్వతికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట/పోలాకి/జలుమూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): అభాగ్యులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో పలు వురు బాధితులకు సీఎంఆర్ఎఫ్, పార్టీ చెక్కులను పంపిణీ చేశారు. జలుమూరు మండలం వెంకట్రావుపురం గ్రామానికి చెందిన పూరుబోయిన శ్రీను వైద్య ఖర్చులకు రూ.70వేలు, పోలాకి మండలం వనవిష్ణుపురంలో ఇటీవల కొట్లాటలో మృతిచెందిన పాలిన వీరస్వామి భార్య పార్వతికి టీడీపీ తరఫున రూ.2లక్షలు చెక్కులను పంపిణీ చేశారు. ఆపద సమయంలో టీడీపీ కార్యకర్తలకుటుంబాలకు ఆర్థికంగా వెన్నుదన్నుగా పార్టీ నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దుంగ స్వామిబాబు, పంచిరెడ్డి రామచంద్రరావు, కూటమి నాయకులు మెట్ట వైకుంఠరావు, పాలిన శ్రీనివాసరావు, బైరి భాస్కరరావు, ఎంవీనాయుడు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ద్విగళ అష్టావధానం



ద్విగళ అష్టావధానంలో పాల్గొన్న పండితులు

నరసన్నపేట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఉర్లాం గ్రామంలో ఆదివారం ద్విగళ అష్టావధానం నిర్వహిం చారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యం ఎంతో గొప్పదని దానిని పరిరక్షించడం చాలా అవసమన్నారు. నేటి తరానికి అవధానంపై అవగాహన కలిగించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. బంకుపల్లె రామచంద్రమూర్తి స్మారికగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని అవధానులు బంకుపల్లె రమేష్ శర్మ, డా.బులుసు అపర్ణ, సుసరాపు చంద్రశేఖర శర్మ, రంప సాయికుమార్ శర్మ నిర్వహించారు. తెలుగు భాషలో ఉన్న వ్యాకరణం, చమత్కారాలు, సాహిత్యంలో ఉండే విషయాలపై చర్చించారు. పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు అవధానులు తమదైన శైలిలో సమాధానాలిచ్చి ఆకట్టుకున్నారు. పృచ్ఛకులుగా డా. పులఖండం శ్రీనివాసరావు, సుసరాపు గణపతిశర్మ, ఎస్.గోవిందరావు, ఆరవెల్లి సీతారామస్వామి, రామాయణం సత్యనారాయణ శర్మ, భాస్కరభట్ల బాలకృష్ణ శర్మ, మావుడూరి రామజోగేశ్వర శర్మ, భమిడిపాటి గౌరీశంకర్ వ్యవ హరించగా డా.గొలివి మోహనరావు, నిర్వాహకులు బంకుపల్లి శ్రీదివాకర్ శర్మ, సింహాచల శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం

పోలాకి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని ప్రముఖ ప్రవచకులు యిప్పిలి రామకృష్ణ శర్మ అన్నారు. ఆదివారం డీఎల్‌పురం పంచాయతీ చింతాడపేట స్వామి రామయోగి సేవా శ్రమంలో సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సేవాశ్రమంలో ప్రతి నెలా రెండో ఆదివారం సత్సంగం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక బోధన అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బమ్మిడి విశ్వనాథం, కరుకోల అనంతరావు, సింగుపురం లక్ష్మణరావు, బొడ్డేపల్లి అప్పలనాయుడు, వై.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



'ఆధ్యాత్మిక బోధన' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

గ్రామాల్లో లయన్స్ క్లబ్ సేవలు విస్తరించాలి



సమావేశంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ తదితరులు

నరసన్నపేట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఉత్సాహవంతులైన యువతను సామాజిక సేవలో భాగస్వామ్యం చేసేందుకు లయన్స్ క్లబ్‌లో చేర్చాలని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఎన్‌వీబీఎస్ఎస్ ప్రసాద్ కోరారు. ఆదివారం స్థానిక వర్తకసంఘం భవనంలో లయన్ జిల్లా 316ఏ కేబినెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సేవలను విస్తరించేందుకు కృషి చేయాలని, పేదలకు విద్య, వైద్యసేవలను అందించేందుకు ముందుకు రావాలన్నారు. నరసన్నపేట లయన్స్‌క్లబ్ అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ ఉణ్ణ రంగనాథ్, రమణసాహూ, సాయిరాం, కె.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మధుమేహ వ్యాధి పరీక్షలు

కాశీబుగ్గ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక మూడు రోడ్ల జంక్షన్ వద్ద ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ పలాస-కాశీబుగ్గ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ వ్యాధి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు తూముల శ్రీను, తంగుడు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి నెలా క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో ఉన్న పేద ప్రజలకు మధుమేహ వ్యాధి పరీక్షలు చేసి, రిపోర్ట్ అందజేయడంతో పాటు మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎం.మనీల్‌కుమార్, బి.తరుణ్, ఎం.మనోజ్, పి.సాగర్ తదితరులు ఉన్నారు.

ఇంటర్వ్యూ

రూ.571 కోట్లతో తాగునీటికి ప్రతిపాదన

● ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రామకృష్ణ



టెక్కలి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జల్ జీవన్ మిషన్ కింద టెక్కలి నియోజకవర్గంలో రూ.571 కోట్లతో తాగు నీరందించేందుకు ప్రతిపాదనలు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఎస్.రామకృష్ణ 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.

ప్రశ్న: జల్‌జీవన్ మిషన్‌ను ఎన్ని గ్రామాల్లో అమలుచేస్తారు?

జవాబు: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, కోటబొమ్మాళి మండలాల్లో 499 గ్రామాలో ఈ పథకం అమలు చేసేందుకు, ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్ల ద్వారా సరఫరాకు ప్రతిపాదనలు చేశాం.

ప్ర: ఈ నీటిని ఎక్కడ నుంచి వినియోగించనున్నారు?

జ: గొట్టాబ్యారేజ్‌లో 19 టీఎంసీ స్టోరేజీ అవకాశముంది. అందులో నాలుగున్నర టీఎంసీలు తాగునీటికి కేటాయించనున్నారు. అక్కడి నుంచి నేరుగా బొంతు జంక్షన్‌కు, బొంతు జంక్షన్ నుంచి కొత్తపేట కొండపైకి పైపులైన్లతో తీసుకువచ్చి అక్కడ ప్యూర్‌ఫైడ్ అయిన తరువాత పైపులైన్ల ద్వారా గ్రామాలకు సరఫరా చేస్తాం.

ప్ర: రక్షిత నీటి పథకాలు మాటేమిటి?

జ: నియోజకవర్గంలో 147 రక్షిత నీటి పథకాలన్నాయి. వీటిలో 23 మినీ పీడబ్ల్యూడీ స్కీమ్‌లున్నాయి. టెక్కలి మేజర్ పంచాయతీలో ఉన్న ఎర్రన్నాయుడు రక్షిత నీటి పథకం, జడ్పీ నిధులతో ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నాం.

ప్ర: తాగునీటి కోసం ఎంపీ నిధులు కేటాయించారా?

జ: టెక్కలి మండలం కిట్టాలపాడులో కిడ్నీ వ్యాధిగ్రస్థులు ఎక్కువగా ఉండడంతో ఆ గ్రామానికి సురక్షిత తాగునీరందించేందుకు రూ.10లక్షలు ఎంపీ లాడ్స్ నుంచి మంజూరు చేశారు. ఆర్వో ప్లాంట్ పనులు త్వరలో ప్రారంభించాల్సి ఉంది.

జిల్లా స్థాయి జానపద పోటీలకు ఆహ్వానం

పలాసరూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రంగోయి గ్రామంలో గిడుగు రామమూర్తి తెలుగుభాష- జానపద కళాపీఠం ఆధ్వర్యంలో జానపద కళాజాతలో భాగంగా సంప్రదాయ జానపద గీతాల పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలో సంప్రదాయ గీతాలను మాత్రమే ఆలపించాలని, పాటల్లో అశ్లీలత కూడదని, విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు.

పోరాటాలతోనే చిలకమ్మకు నివాళి

హరిపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బాధితుల పక్షాన నిలిచి సమరశీల ప్రతిఘటనా పోరాటాలతోనే చిలకమ్మకు నిజమైన నివాళి అని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అన్నారు. కొండలోగాం గిరిజన గ్రామంలో ఆదివాసీ సమస్యలపై వీరోచిత పోరాటం చేసిన చిలకమ్మ వర్ధంతి సభ నిర్వహించారు. స్మారక స్థూపం వద్ద ఆదివారం ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పోతనపల్లి కుసుమ, గొరకల బాలకృష్ణ, వంకల మాధవరావు, సార జగన్, సన్నశెట్టి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు.. రెట్టింపు భరోసా

(ఐదో పేజీ తరువాయి)

టీడీపీ ప్రభుత్వ హయాంలో(2014-19 మధ్య) మత్స్యకారులకు 11 రకాల పథకాలపై రాయితీ ఇచ్చేవారు. హై ఫ్రీక్వెన్సీ సెట్లు, జీపీఎస్, గిల్‌సెట్లు, ఫిష్ ఫైండర్స్, వలలు, తెప్పలు, ఐస్‌బాక్స్‌లు, ద్విచక్ర వాహనాలు, లగేజీ వాహనాలను 90శాతం రాయితీపై అందించేవారు. ఆ తరువాత అధికారలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాయితీలు తగ్గిం చడంతో మత్స్యకారులు పెద్దగా ప్రయోజనం పొందలేకపోయారు.

మత్స్యకారులకు ఎంతో మేలు



కూటమి ప్రభుత్వం వేట నిషేధ భృతిని రూ.10వేల నుంచి రూ.20వేలకు పెంచడంతో మత్స్యకారులకు ఎంతో మేలు జరుగుతుంది. మత్స్యకారులకు ఎప్పుడూ టీడీపీ అండగా ఉంటుంది. గతంలో 90రాయితీపై అందించిన పథకాలను వైసీపీ ప్రభుత్వం ఎత్తేసి మత్స్యకారులకు అన్యాయం చేసింది.

- సూరాడ ధనరాజు, మత్స్యకార నాయకుడు, సూరాడవానిపేట

వేటకు వెళ్లిన వారికి అందించాలి



వేటకు వెళ్లిన ప్రతి మత్స్యకారుడికీ భృతి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. గత వైసీపీ ప్రభుత్వంలో అనర్హులకే వేట నిషేధ భృతి అందింది. భృతిని రెట్టింపు చేసిన మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు.

- సూరాడ దాసురాజు, టీడీపీ జిల్లా మత్స్యకార నాయకుడు, మరువాడ

ఆదేశాలు రావాల్సి ఉంది

మత్స్యకారుల వేట నిషేధ భృతిని రూ.20వేలకు పెంచుతున్నట్లు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావలసి ఉంది. జిల్లాలో 16వేల మందికి పైగా మత్స్యకారులకు వేట నిషేధ భృతి అందనుంది.

- ధర్మరాజు పాత్రో, ఎఫ్‌డీవో, మత్స్యశాఖ, టెక్కలి